సాక్షి
బాపట్ల

ఆదివారం ၊ 16 ၊ జూలై ၊ 2023



కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు సీజ్

పట్నంబజారు: గుంటూరు జిల్లాలో శనివారం రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై 20 కేసులు నమోదు చేశారు.



సంరక్షణ కేంద్రానికి బాలలు

నెహ్రూనగర్: గుంటూరు రైల్వే స్టేషన్‌లో 10 నుంచి 17 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న 19 మంది బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రానికి పంపించినట్లు ఐసీడీఎస్ పీడీ మనోరంజని తెలిపారు.



తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ ఆలయానికి శనివారం తెనాలికి చెందిన సూర్యదేవర బాలకృష్ణ, స్వరూపరాణి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

21న జిల్లా అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు అండర్– 10, 12, 14, 16 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 100, 300, 600, 800 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో పోటీలుంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 20లోపు తమ ఎంట్రీలను స్టేడియంలో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96666 35296 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

23న స్టేట్ ఓపెన్ టెన్నిస్ పోటీలు...
గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన అండర్– 12, 14, 16 బాల బాలికల టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కార్యదర్శి కె.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. తమ ఎంట్రీలను ఈ నెల 21 సాయంత్రంలోపు అందజేయాలన్నారు. వివరాలకు 81437 83999 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 518.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకి 4,547 ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది.

స్టాఫ్‌నర్సులుగా 76 మందికి నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సుల భర్తీకి శనివారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం (ఆర్డీ) లో కౌన్సెలింగ్ జరిగింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో 76 మందికి నూతనంగా స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగ నియామక పత్రాలను గుంటూరు ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన నర్సింగ్ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ యాస్మిన్ సూచించారు.

దాసాంజనేయుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని మాచవరం దాసాంజనేయ స్వామి వారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి వెంకట రమణ దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు సుబ్బయ్య ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరానికి చెందిన భక్తులు వాసిరెడ్డి పార్థసారథి, అనురాధ దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. నిత్యాన్నదాన సేవలో ఈ విరాళాన్ని వినియోగించాలని దుర్గగుడి అధికారులను కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

పారదర్శకతకు పెద్దపీట

- మద్యం దుకాణాల్లోనూ డిజిటల్ లావాదేవీలు
- జిల్లాలోని 170 షాపుల్లో అమలు



మద్యం దుకాణంలో కార్డు స్వైపింగ్ మిషన్

చీరాల: మద్యం కావాలంటే జేబులో తప్పనిసరిగా సొమ్ము ఉండాల్సిందే. లేదంటే మద్యం కొనుగోలు చేయడం కష్టం. ఇదంతా గతంలో సంగతి. జేబులో నగదు లేకపోయినప్పటికీ బ్యాంకు ఖాతాలో ఉంటే చాలు. కావాల్సిన మద్యం కొనుగోలు చేయవచ్చు. అన్ని లావాదేవీలు డిజిటల్ విధానంలో చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్యం కొనుగోలుకు కూడా డిజిటల్ లావాదేవీలకు అవకాశం కల్పించింది. నూతనంగా అన్ని మద్యం షాపుల్లో పేటీఎం, ఎస్‌బీఐకు చెందిన ఫోన్‌పే సౌకర్యం కల్పించింది.

జిల్లాలో 170 ప్రభుత్వ మద్యం షాపులు..
జిల్లాలో చీరాల, పర్చూరు, అద్దంకి, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో 170 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా 25 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇప్పటికే బార్ అండ్ రెస్టారెంట్లలో డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాల విమర్శలకు, ఆరోపణలకు చెక్ పెడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాలలో సైతం డిజిటల్ లావాదేవీలను ఏర్పాటు చేసింది.

ప్రతిపక్షాల విమర్శలకు కళ్లెం..
డిజిటల్ లావాదేవీల ద్వారా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు కూడా కళ్లెం వేసినట్లయింది. మద్యం దుకాణాల్లో జరిగే లావాదేవీలన్నీ పక్కదారి పడుతున్నాయని ప్రతిపక్షాలు పచ్చమీడియాతో పాటు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలకు దిగడంతో పాటు ప్రభుత్వంపై బురదజల్లే యత్నం జరుగుతోంది. మద్యం దుకాణాల్లో లావాదేవీలు పారదర్శకంగా ఉండడంతో పాటు కొనుగోలుదారుడికి పూర్తి నమ్మకంతో చెల్లించేందుకుగాను డిజిటల్ లావాదేవీలను అమలు చేస్తోంది. గత వారం రోజులుగా ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది. క్రెడిట్ కార్డులపై మాత్రం నిబంధనల మేరకు చార్జీలు ఉంటాయి.

డిజిటల్ లావాదేవీలతో మోసాలకు చెక్..
డిజిటల్ లావాదేవీలతో మోసాలకు చెక్ పెట్టొచ్చని అధికారులు భావిస్తున్నారు. మద్యం దుకాణంలో పక్కాగా మందు స్టాకు వివరాలు తెలుస్తాయి. ఇప్పటివరకు మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలకు అనుమతులు లేకపోవడంతో మద్యంపై ఎంత ఆదాయం వస్తుందో సరైన లెక్కలు బయటకు రాలేదు. డిజిటల్ లావాదేవీలను అంగీకరించే బాధ్యతను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పగించారు. ఇప్పటివరకు ఏపీ ఎస్‌బీసీఎల్ మద్యం కొనుగోలదారుల నుంచి నగదును సేకరించి ఎస్‌బీఐలో డిపాజిట్ చేస్తుంది. ఈడబ్బును మరుసటి రోజు ప్రభుత్వ ఖజానాకు పంపుతుంది. బ్రాండ్, వాల్యూమ్, ధర, మద్యం అవుట్‌లెట్, కస్టమర్ గుర్తింపు, ఇతర వివరాల పరంగా మద్యం విక్రయాలను ట్రాక్ చేసేందుకు డిజిటల్ చెల్లింపులు సహాయపడతాయి. ఏటీఎం కార్డు స్వైపింగ్, యూపీఐ, క్యూఆర్ కోడ్ తదితర డిజిటల్ చెల్లింపుల ద్వారా చేసుకోవచ్చు. డైరెక్ట్‌గా నగదు లావాదేవీలు అయితే స్థానికంగా షాపుల్లో ఉండే మద్యం పక్కదారి పట్టకుండా, మద్యం లెక్కలు తెలుస్తాయి. అలానే మద్యం షాపుల్లోనే నగదు ఉంచడం వలన ఇటీవల పలు మద్యం దుకాణాల్లో నగదు చోరీకి గురయ్యేవి. ఇంకా చాలా చోట్ల నగదు రికవరీ కాలేదు. ఈ సమస్యలను కూడా అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్స్ ఎంతో ఉపయోగపడతాయి.

పారదర్శకత కోసమే డిజిటల్ లావాదేవీలు..



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పారదర్శకంగా మద్యం అమ్మకాలు సాగించేందుకు కొనుగోలుదారులకు వీలుగా డిజిటల్ లావాదేవీలను ఏర్పాటు చేశాం. జిల్లాలోని 170 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్, కార్డు స్వైపింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ పేమెంట్‌ల ద్వారా ఎమ్మార్పీకి మద్యం కొనుగోలు చేయడంతో పాటు చిల్లర సమస్యకు కూడా ఇబ్బందులు ఉండవు. పారదర్శకంగా మద్యం అమ్మకాలు చేసేందుకు వీలుంది.

– హనుమంతరావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

బియ్యం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



బియ్యం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ శ్రీధర్


బాపట్ల అర్బన్: బాపట్ల స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా బాపట్ల రైస్ మిల్లర్స్ హాలులో బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో విక్రయించే బియ్యం ధరల కంటే తక్కువగా కేజీ రూ.60విలువ చేసే సూపర్ ఫైన్ రూ.48లకు, రూ. 55లవి రూ 44కు, రూ. 40కు విక్రయించేవి రూ. 34కు విక్రయించేలా సివిల్ సప్లయి కార్పొరేషన్, స్థానిక రైస్ మిల్లర్స్ సహకారంతో ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి విలియమ్స్, డెప్యూటీ తహసీల్దార్ ఓంకార్, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు బి.వి.రత్నగుప్తా, ప్రధాన కార్యదర్శి రావి శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్. హనుమంతరావు, ఉపాధ్యక్షులు ఎస్.నరసింహారావు, తటపర్తి గురుబ్రహ్మం, లీగల్ అడ్వైజర్. తటపర్తి శిరీష, సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకం.. సరఫరా వినూత్నం

సెమిస్టర్ -2 పుస్తకాలొచ్చేశాయ్..
- ప్రయోగాత్మకంగా 90 పాఠశాలలకు అమెజాన్ ద్వారా నేరుగా సరఫరా
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండీయూ వాహనాలతో పంపిణీకి ఏర్పాట్లు
- గుంటూరు జిల్లా గోడౌన్ నుంచి మండలాలకు చేరుతున్న పుస్తకాలు
- విద్యార్థులకు నిర్దేశిత సమయానికే పుస్తకాలు పంపిణీ



పుస్తకాలను అమెజాన్ ద్వారా పాఠశాలలకు పంపేందుకు ప్యాక్ చేస్తున్న సిబ్బంది



సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల పంపిణీ వేగవంతమైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను గుంటూరులోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాము నుంచి మండల కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. సెమిస్టర్-2 పుస్తకాలను అమెజాన్ ద్వారా పార్శిల్స్ రూపంలో ప్రయోగాత్మకంగా పంపేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 90 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ మేరకు గుంటూరు అమరావతిరోడ్డులోని గోడౌన్ నుంచి ఎంపిక చేసిన పాఠశాలలకు శనివారం అమెజాన్ ద్వారా పుస్తకాలను పంపించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలోని ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు నేరుగా పంపిణీ చేయనున్నారు. మండల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ముందుగా మండల కేంద్రాలకు పంపి, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేయనున్నారు.

22న విద్యార్థులందరికీ ఒకేసారి..
మండలానికి అవసరమైన వాహనాల సంఖ్యను రెవెన్యూశాఖ నుంచి ఎంఈఓలకు వివరాలను అందజేశారు. సంబంధిత ఎంఈఓలు తహసీల్దార్‌ను సంప్రదించి, తమ మండలానికి అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. మండల పరిధిలోని పాఠశాలలకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని, పంపాల్సిన పుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేయాల్సి ఉండగా, పాఠశాలలకు సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఈ నెల 22న విద్యార్థులందరికీ ఒకేసారి పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలానికి వచ్చిన సెమిస్టర్-2 పుస్తకాలను పాఠశాలలకు పంపేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడంలో ఎంఈఓలు, పాఠశాలలకు వచ్చిన పుస్తకాలను నిర్దేశించిన రోజున విద్యార్థులకు పంపిణీ చేయడంలో ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు చేపట్టాలని డీఈఓ పి.శైలజ ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాకు 9,49,412 పాఠ్య పుస్తకాలు..
ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన 9,49,412 సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలకు ప్రభుత్వానికి పంపిన ఇండెంట్‌లో శనివారం నాటికి 9,37,429 పుస్తకాలు వచ్చాయి. వీటిలో 7,00,315 పుస్తకాలను మొత్తం 57 మండలాలకు గాను 45 మండలాలకు పంపించారు. సోమవారం నాటికి అన్ని మండలాలకు సరఫరా పూర్తి కానున్నట్లు పాఠ్య పుస్తక విభాగ జిల్లా మేనేజర్ వి.వజ్రబాబు చెప్పారు.

రైతు బజార్లలో బియ్యం విక్రయాలు

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకు బియ్యంను ప్రజలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ జె.రాజకుమారి పేర్కొన్నారు. చుట్టుగుంట రైతు బజారులో బియ్యం కౌంటర్ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్ రైతు బజార్లతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు బియ్యం విక్రయించేలా చర్యలు చేపట్టామన్నారు. స్టీమ్ రైస్ కిలో రూ.44, బీపీటీ రకం రూ.48 వినియోగదారుల అవసరాన్ని బట్టి ఎన్ని కిలోలైనా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 17వ తేదీ నుంచి మినపగుళ్లు కిలో రూ.101, కందిపప్పు కిలో రూ.135 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులకు మేలు

- మంత్రి మేరుగ నాగార్జున
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాతో కలిసి సర్టిఫికెట్లు అందజేత



మండూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

చుండూరు(వేమూరు): మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెదపీట వేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షత వహించారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేశారన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేందే విధంగా ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రజల ముగింటకు సేవలు అందేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వివిధ కారణాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేని అర్హులకోసం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, నియోజక వర్గం ప్రత్యేకాధికారి బొంత ఆంజనేయులు, చుండూరు ఎంపీపీ జాలాది రూబేను చుండూరు తహసీల్దార్ కనకదుర్గ, ఎంపీడీఓ సుగుణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యాధునిక సర్జరీలతో అద్భుతాలు

- జీజీహెచ్‌లో వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే వేడుకలు
- పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అత్యాధునిక శస్త్రచికిత్సలతో రోడ్డు ప్రమాద బాధితులు, రోగులకు అత్యాధునిక ఆపరేషన్లు చేసి నూతన జీవితాలు ప్రసాదిస్తూ అత్యద్భుతాలు సృష్టిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా శనివారం ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో చెయ్యి, కాలు, ఇతర అవయవాలు దెబ్బతిన్న వాటిని సరిచేయడంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఎంతో కీలకమైందన్నారు. ప్రమాదం జరిగిన ఆరు గంటల్లో ఆసుపత్రికి తీసుకొస్తే అవయవాలు సరిచేయడం కుదురుతోందన్నారు. క్యాజువాల్టీలో ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. శుక్రవారం 11 ఆపరేషన్లు చేసి ఏపీలోనే అరుదైన రికార్డు సృష్టించిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్, ఇతర వైద్యులను డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు. ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా వార్డులో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగా భవానీ, డాక్టర్ నజ్మ, డాక్టర్ చంద్రలేఖ, డాక్టర్ నిషాంత్ పాల్గొన్నారు.

చంద్రబాబు దుర్మార్గపు వ్యాఖ్యలు మానుకోవాలి

ఎమ్మెల్సీ పోతుల సునీత



చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

బాపట్ల: వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను స్థానిక గడియార స్తంభం వద్ద శనివారం సాయంత్రం దహనం చేశారు. పోతుల సునీత మాట్లాడుతూ మహిళలంటే చంద్రబాబునాయుడుకు మొదటి నుంచి చిన్నచూపేనన్నారు. రాష్ట్రంలో నిస్వార్థంగా పని చేస్తున్న వలంటీర్లపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం చూస్తుంటే చంద్రబాబునాయుడుకు మతిస్థిమితం లేదని అర్థం అవుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి ఆదరణ కోల్పోయిన చంద్రబాబునాయుడు ఆ బాధ భరించలేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మహిళలను లక్షాధికారులను చేస్తానని మోసం చేసిన చంద్రబాబునాయుడు మళ్లీ మహిళలను మోసం చేసేందుకు హామీలు కురిపిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడున్ని నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లు దుర్మార్గమైన కుట్రలు చేస్తున్నారని పోతుల పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో 175 కి 175 సీట్లు వైఎస్సార్ సీపీ సాధిస్తుందన్నారు. దిష్టిబొమ్మ దహనం అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి చంద్రబాబునాయుడుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో మహిళా నాయకులు వేల్పుల మీరాభి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, ఝన్సీ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'మొక్క'వోని సంకల్పం

నరసరావుపేట రూరల్: మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో కోటప్పకొండ అటవీ ప్రాంతంలోని గిరి ప్రదక్షిణ మార్గంలో విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రకృతి పాఠశాల స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఐదు వేల విత్తన బంతులు కోటప్పకొండ అటవీప్రాంతంలో విసరనున్నట్లు తెలిపారు.

పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి: పీజీ సెట్‌లో కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల బీఎస్సీ విద్యార్థి జలగం సుమంత్‌కి వృక్షశాస్త్ర విభాగంలో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న అతి పెద్ద ముఠాను వేటపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని, వీరి నుంచి ఇన్నోవా కారు, 55 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసులో 26 మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని దానిలో భాగంగానే పలువురిపై పీడీ యాక్టు అమలు చేసి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. వీరితో పాటు గంజాయి తాగే 14 మందిని కూడా కేసులో నిందితులుగా చేర్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ఇకపై గంజాయి తాగిన వారిని కూడా అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

కోర్టుల్లో శిక్షలు పడేలా కృషి చేయాలి

కోర్టులలో శిక్షల శాతం పెరిగేలా పోలీస్ అధికారులు, పీపీలు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలు పోలీసు అధికారులు, కోర్టు ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం శనివారం నిర్వహించారు. నమోదైన కేసులలో దర్యాప్తులు, చార్జిషీట్లు ఫైల్ చేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, నిందితులకు సంబంధించిన వారెంట్లు, సమన్లను అమలు, కోర్టులో సీడీ ఫైల్స్ దాఖలు పర్చడం, కోర్టు వాయిదాలకు సరియైన సమయంలో సాక్షులను కోర్టు ఎదుట హాజరపరచుట, సాక్షులకు ముందే బ్రీఫింగ్ చేయడం తదితర విషయాలపై పలు విషయాలపై ఎస్పీ సూచనలు ఇచ్చారు. నేరం చేసిన నిందితులకు కోర్టులో శిక్ష విధించినప్పుడే బాధితులకు న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, ప్రాసిక్యూటర్లు సత్సంబంధాలు ఉండాలన్నారు. పోలీస్ అధికారులు ఆయా కోర్ట్ పరిధిలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను సంప్రదించి చార్జిషీట్ ఫైల్ చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహేష్, గుంటూరు జిల్లా కోర్టు డెప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు, ఒంగోలు జిల్లా కోర్టు డెప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సత్తా చాటిన నెల్లూరు ఎడ్ల జత

స్వర్ణలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



మొదటి బహుమతిని సొంతం చేసుకున్న నెల్లూరు ఎడ్ల జత, యజమానులు

స్వర్ణ (కారంచేడు): రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. మండలంలోని స్వర్ణ గ్రామంలో గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకొని నెల పొంగళ్ల సందర్భంగా గ్రామంలో పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన ఎడ్లు విజేతలుగా నిలిచాయి. శనివారం గ్రామంలోని రంగప్పనాయుడువారిపాలెం రోడ్డులో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రకాశం, నెల్లూరు, తూర్పు గోదావరి, ఎన్‌టీఆర్ కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన 22 జతల ఎడ్లు పాల్గొన్నాయి. టైరు బండితో ఒక కిలోమీటరు దూరాన్ని తక్కువ సమయంలో లాగిన ఎడ్ల జతలను నిర్వాహకులు విజేతలుగా ప్రకటించారు. నిర్దీత దూరాన్ని నెల్లూరు జిల్లా గంగపట్నానికి చెందిన చాముండేశ్వరి సీ ఫుడ్స్ ఎడ్ల జత 4:27 నిమిషాల్లో పరుగులు తీసి మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా కంకటపాలేనికి చెందిన బోడపాటి శివలక్ష్మికి చెందిన ఎడ్ల జత 4:29 నిమిషాల్లో ద్వితీయ స్థానం, నెల్లూరు జిల్లా ఇనగల్లుకు చెందిన మహేశ్వరరావు ఎడ్ల జత 4:32 నిమిషాల్లో తృతీయ స్థానంలో నిలిచాయి. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా నెల్లూరు జిల్లా గంగపటానికి చెందిన మోక్షతరెడ్డికి చెందిన ఎడ్ల జత 4:35 నిమిషాలు, ఎన్‌టీఆర్ కృష్ణాజిల్లా జమ్మిగొల్లపల్లి పెద్ది సాయి సిద్ధార్థకు చెందిన ఎడ్ల జత 4:37 నిమిషాలు, బాపట్ల జిల్లా చీరాలకు చెందిన గుంజి హేమంత్‌కు చెందిన ఎడ్ల జత 4:42 నిమిషాలు, ప్రకాశం జిల్లా పమిడిపాడు నల్లమోతు సాయిహర్షకు చెందిన ఎడ్ల జత 4:47 నిమిషాలు, ఎన్‌టీఆర్ జిల్లా నిడమానూరు నాగి పిచ్చిరెడ్డికి చెందిన ఎడ్ల జత 4:50 నిమిషాల్లో లక్ష్యాలను సాధించి తమ విజయాలను సొంతం చేసుకున్నాయి. గెలుపొందిన విజేతల ఎడ్ల జతల యజమానులను ఘనంగా సత్కరించి, బహుమతులు పంపిణీ చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా పీ శ్రీనివాసరావు, కే ప్రసాద్, కేఎస్‌కే ప్రసాదరావు, పూల గోపీ వ్యవహరించారు. పోటీలను స్వర్ణమ్మ తల్లి కమిటీ సహకారంతో నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు నాగేశ్వరరావు

మార్టూరు: భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్ధలతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొల్లాపల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కమలాకర్ వివరాలు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన సందెపాము నాగేశ్వరరావు(42) శుక్రవారం సాయంత్రం నాగేశ్వరరావు భార్య బంధువులతో కలసి ఒంగోలు సమీపంలోని ఉలిచి గ్రామానికి శుభకార్యం నిమిత్తం బయలు దేరిందేకు సిద్ధమైంది. నాగేశ్వరరావు బైక్‌పై తన భార్యను ఉలిచిలో వదిలి పెడతానని చెప్పి బజారుకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో ఆమె తన బంధువులతో కలసి ఉలిచి వెళ్లి వచ్చింది. ఈ విషయమై మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శనివారం ఉదయం బొల్లాపల్లిలో నాగేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

బీసీలకు అండగా నిలిచింది జగనన్నే

ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

క్రోసూరు(పెదకూరపాడు): రాష్ట్రంలో ఉన్న బీసీ కులాలకు గుర్తింపు, ప్రాధాన్యం ఇచ్చి అన్ని రకాలుగా అండగా నిలిచింది ఒక్క సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ బీసీల ఆత్మీయ సదస్సుకు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. జంగా మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాలను ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు వాడుకున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదు మండలాల బీసీ సెల్ అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. తొలుత ఎంపికైన కమిటీ ప్రతినిధులు జంగా కృష్ణమూర్తిని, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, షేక్ మస్తాన్, గంజినబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ షరీఫ్, తిప్పిరెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డాక్టరు బి.వి.నాథ్ ఆడిటోరియంలో వేడుకలకు శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

త్రుటిలో తప్పిన ఫైబర్‌బోటు ప్రమాదం



ప్రాణాలతో బయటపడ్డ మత్స్యకారులు రవేంద్ర, అశోక్

నిజాంపట్నం: ఫైబర్‌బోటు మునిగి ఇద్దరు మత్స్యకారులు ప్రాణాలతో బయటపడిన ఘటన నిజాంపట్నం సముద్ర తీరాన చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. నిజాంపట్నానికి చెందిన నాయుడు రవేంద్ర ఫైబర్‌బోటుపై వేటచేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. చిన్నఫైబర్ బోటు కావడంతో రవేంద్ర తన భార్యతో కలసి వేటకు వెళుతుంటాడు. అయితే తన భార్య అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం ఉదయం రవేంద్రకు తోడుగా వల్లభనేని అశోక్‌ను తీసుకుని ఫైబర్‌బోటుపై వేటకు వెళ్లాడు. రాత్రి 11 గంటల దాకా వేటచేసుకుని తిరిగి వస్తుండగా సముద్రము, రేవు కలిసే మొగ ప్రాంతంలో అలలతాకిడికి ఫైబర్‌బోటు నీటమునిగి పోయింది. దీంతో రవేంద్ర, అశోక్ చిమ్మచీకటిలో రేవులో ఈదుకుంటూ ఒడ్డుకు ఒడ్డుకు చేరి ప్రాణాలు కాపాడుకున్నారు. వెంటనే గజ ఈతగాళ్ళను తీసుకుని వెళ్ళి బోటు మునిగిపోయిన ప్రాంతంలో నాలుగు గంటలసేపు వెతికినప్పటికీ బోటు, వలలు దొరకలేదని బాధితులు వాపోయారు. బోటు, వలల ఖరీదు సుమారు రూ.1,50,000 ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తయారు చేసిన బోటు కావడంతో ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదని చెబుతున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రవేంద్ర తెలిపారు.